# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

JANUARY 2007

సంవత్సర చందా రూ. 50/-

సత్యవాణి ఇప్పుడు 'విస్పా' ఛానెల్ లో కూడ

ప్రతి గురువారం ఉదయం 7:00 గం॥

నుండి 7:30 గం॥ల వరకు చూడండి.

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న

సత్యవాణి టి.వి. కార్యక్రమములను

ప్రతి మంగళవారం : ఉదయం 6:30 గం॥లకు
'మా' టి.వి. లోను

ప్రతి గురువారం : 'విస్పా' ఛానల్ లో ఉదయం 7:00
గం॥లకు

ప్రతి శుక్రవారం : KTV లోను, IN లో ఉదయం
7:00గం॥లకు,సాయంత్రం
5:30గం॥లకు (కాకినాడలో మాత్రమే)

ప్రతి శనివారం : ఉదయం 6:30 గం॥లకు 'తేజ' ఛానల్
లోను చూడండి

ప్రసంగీకులు : బ్రదర్. జాషువా గూటం
బ్రదర్. లక్ష్మి గూటం

సత్యసువార్తను వినండి !!

మీ బంధు మిత్రులకు వినిపించండి !!

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 27 | జనవరి 2007 | సంచిక 6

## బైబిలు ఎందు నిమిత్తము వ్రాయబడెను? - 1

### (Why was the Bible Written?)

బైబిలును లిఖించినవాడు పరలోక మందున్న దేవుడేయని మనము తెలిసి కొనిన తరువాత ఈ సంచికలో బైబిలు గ్రంధము ఎందు నిమిత్తము వ్రాయ బడెనో తెలిసికొందము. ప్రపంచ చరిత్రను, నాగరికతను ఎంతగానో మార్చినట్టి బైబిలు గ్రంధము ఎందు నిమిత్తము వ్రాయబడెనో మీరు ఎన్నడైనను ఆలోచించారా? అది వ్రాయబడి మానవజాతికి ఎందుకు అందజేయబడెను? దాని ప్రయోజన మేమి? ఒక గ్రంధములో వ్రాయబడిన సంగతులను బట్టి ఆ గ్రంధము యొక్క విలువ నిర్ణయించబడునుగదా? అట్లే బైబిలు గ్రంధమును చదువుట ద్వారా అది ఎందు నిమిత్తము వ్రాయబడెనో మనము కూడ గ్రహించ గలము.

మొట్టమొదటిగా, పరలోకమందున్న నిజదేవుని మానవులకు బయలుపరచు నిమిత్తము బైబిలు వ్రాయబడెను. ఆ

నిజదేవుడే సమస్తమును సృష్టించినవాడని, ఈ విశ్వమంతటిని పరిపాలించువాడని బైబిలు బోధించుచున్నది. ఈ గ్రంధము దేవునిచే బయలుపరచబడిన గ్రంధమని తనకుగా తాను చెప్పుకొనుచున్నది. అట్లు ఆరోపించు కొనిన గ్రంధము మరియొకటి ఈ ప్రపంచమందు లేనేలేదు. బైబిలు లేకుండ సృష్టికర్త యొక్క ఉనికిని మనము కొంత అర్ధము చేసుకొనవచ్చును. "దేవుని యొక్క అదృశ్య లక్షణములు, అనగా ఆయన నిత్య శక్తియు, దేవత్వమును జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించటవలన తేటపడుచున్నవి" యని రోమా 1:20లో వ్రాయబడెను. మరల "ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచురపరడుచున్నది" యని కీర్తనలు 19:1లో వ్రాయబడెను. గనుక సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన ఒక గొప్ప సృష్టికర్త యున్నాడని మనము తెలిసికొనగల్గినను, ఆయన తత్వమును గూర్చిగాని, ఆయన చిత్తమును గూర్చిగాని తెలిసికొనలేము. దేవునికి మానవునికి ఉన్న సంబంధము యెట్టిది? మానవుని యెడల దేవుని చిత్తమేమై యున్నది? మానవుడు దేవుని నెట్లు ఆరాధింపవలెను? అను మొదలగు సంగతులను దేవుడు మనకు బయలు పరచనిదే మనమెట్లు తెలిసికొన గలము? దేవుని ప్రత్యేకముగా మానవులకు బయలుపరచు నిమిత్తమే బైబిలు గ్రంధముగా వ్రాయబడెను. అందుకే, "దేవుని జ్ఞానానుసారముగా లోకము తన జ్ఞానము చేత దేవుని ఎరుగకుండినందున, సువార్త ప్రకటన యను వెర్రితనముచేత నమ్మువారిని రక్షించుట దేవుని దయా పూర్వక సంకల్పమాయెను" అని 1 కొరింధి 1:21లో అపొ.పౌలు వ్రాసెను. రోమా 1:16, 17లో అతడు మరల ఇట్లు వ్రాసెను: "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి, మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియైయున్నది. ఎందుకనిన....... దేవుని నీతి దానియందు బయలుపరచబడుచున్నది". గనుక మిత్రులారా, నిజదేవుని, ఆయన చిత్తమును మనకు బయలుపరచు నిమిత్తము బైబిలు గ్రంధము వ్రాయబడినదని మనము

గ్రహించవలెను.

రెండవదిగా, యేసుక్రీస్తును మానవులకు బయలుపరచు నిమిత్తము బైబిలు వ్రాయబడెను. "లేఖనముల యందు మీకు నిత్యజీవము కలదని తలంచుచు వాటిని పరిశోధించుడి. అవే నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి" యని యేసు పలికెను (యోహాను 5:39). పాత నిబంధనను సూచించుచు యేసు ఈ మాటలు పలికెను. క్రీస్తు వచ్చునని పాత నిబంధనలోని ప్రవక్తలు ముందుగానే ప్రవచించిరి. వారి ప్రవచనములను చదువుట ద్వారా క్రీస్తు బయలుపరచ బడును. "మీరు మోషేను నమ్మినట్టయిన నన్నును నమ్ముదురు, అతడు నన్ను గూర్చి వ్రాసెను" అని యోహాను 5:46లో యేసు పలికెను. గనుక మోషే గ్రంధములోను, ప్రవక్తల గ్రంధములలోను క్రీస్తును గూర్చి ప్రవచింపబడెను. పాత నిబంధనలోని లేఖనములే క్రీస్తును మనకు బయలుపరచుచున్న యెడల క్రొత్త నిబంధనలోని లేఖనములు క్రీస్తును గూర్చి మరింత యెక్కువగా మనకు బయలుపరచును గదా?

క్రొత్త నిబంధనలోని మొదటి నాలుగు సువార్తలు ఈ భూమిపై క్రీస్తు యొక్క జీవితమును గూర్చి వ్రాయబడిన పుస్తకములు. ఆయన ఎక్కడ, ఎప్పుడు, ఎట్లు జన్మించెనో, ఏమి బోధించెనో, ఎట్టి గొప్ప కార్యములను చేసెనో, కల్వరిపై ఆయన ఎట్లు మరణించెనో చివరిగా ఆయన సమాధిని జయించి పునరుత్థానుడెట్లాయెనో ఆ నాలుగు సువార్తలు మనకు తెలియజేయుచున్నవి. క్రొత్త నిబంధన గ్రంధమును చదువుట ద్వారా యేసుక్రీస్తును గూర్చి మనము ఎక్కువ తెలిసికొనగలము. ఆయనను మానవులకు బయలుపరచు నిమిత్తము అది వ్రాయబడెను. అంతేకాదు యేసుక్రీస్తు దేవుని కుమారుడని అది మనకు బయలుపరచుచున్నది. యోహాను వ్రాసిన సువార్త ఆఖరి భాగములో ఆ భక్తుడు ఇట్లు వ్రాసెను: "మరియు అనేకమైన యితర సూచక్రియలను యేసు తన శిష్యులయెదుట చేసెను; అవి యీ గ్రంధమందు వ్రాయబడి యుండలేదు గాని, యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము

పొందునట్లును, ఇవి వ్రాయబడెను" (యోహాను 20:30,31). యేసుక్రీస్తు దేవుని కుమారుడని, పాపులరక్షకుడని బైబిలు మనకు ఆయనను గూర్చి బయలుపరచు చున్నది.

మూడవదిగా బైబలు మానవునికి మానవుని బయలు పరచుచున్నది. మానవుడు నిజముగా ఏమైయున్నాడో బైబిలు బోధించుచున్నది. అతడు ఎక్కడనుండి వచ్చెనో, ఎక్కడికి వెళ్ళుచున్నాడో, అతని తత్వమేమిటో, చివరకు అతని గమ్యమేమిటో బైబిలు ఒక్కటి మాత్రమే మానవునికి బయలు పరచుచున్నది. ఆది కాండము 1:27లో ఇట్లు వ్రాయబడి యున్నది: "దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను; దేవుని స్వరూపమందు వాని సృజించెను; స్త్రీనిగాను పురుషుని గాను వారిని సృజించెను". ఈ చిన్న వచనములో మానవుని యొక్క ఆరంభము, అతని తత్వము సూక్ష్మమముగా తెలియజేయ బడినది. అతడు దేవునిచే సృష్టింపబడి నందున ఈ భూమిపై ఆరంభమాయెను. అతడు దేవుని స్వరూపమందు సృష్టింపబడెనని చెప్పుటలో అతని తత్వము బయలుపరచబడెను. దేవుడు భౌతిక కాయుడు కాడు గనుక మానవుడు దేవుని భౌతిక స్వరూపమున చేయబడ లేదుగాని, దేవుని యొక్క ఆత్మీయ స్వరూపమందు అతడు చేయబడెను. మానవుడు పరిపూర్ణుడుగా, విచక్షణ జ్ఞానము కలిగినవాడై మొదట సృష్టింప బడెను. అందువలన అతడు జంతువుల నుండి వేరుగా యుండెను.

మానవుడు ఆత్మీయ వ్యక్తిత్వము గలవాడు. అందువల్లనే "ఆత్మను చంపనేరక దేహమునే చంపువానికి భయపడకుడిగాని, ఆత్మను దేహమును కూడ నరకములో నశింపజేయగలవానికి మిక్కిలి భయపడుడి" యని మత్తయి 10:28లో యేసు బోధించినప్పుడు మానవుని యొక్క నిజ తత్వమును గూర్చి, అనగా అతని శరీర, ఆత్మల వ్యత్యాసమును గూర్చి యేసుక్రీస్తు ఎక్కువ మనకు బయలుపరచెను. అందుకే "శరీరము కేవలము నిష్ప్రయోజనము, ఆత్మయే జీవింపజేయుచున్నది" అని ఆయన మరల పలికెను (యోహాను 6:63). మానవుడు శారీరకముగ చనిపోయినను, అతని ఆత్మ మాత్రము నిత్యము జీవించునట్టిది యని బైబిలు బోధించుచున్నది.

అయితే మానవుని గమ్యము ఏది? దానిని గూర్చి యేసు ఇట్లు చెప్పెను: దీనికి ఆశ్చర్యపడకుడి; ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమున సమాధు లలో నున్న వారందరు ఆయన శబ్దమును విని మేలు చేసినవారు జీవ పునరుత్థానమునకును, కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకు బయటికి వచ్చెదరు" (యోహాను 5:28,29). మనలో ప్రతి ఒక్కరును నిత్యత్వమును పరలోకములో గాని లేదా నరక లోకములోగాని గడుపుదుము అని బైబిలు బోధించుచున్నది. ఈ లోకమందు మనము జీవించియుండగా క్రీస్తును నమ్మి ఆయన కట్టడలననుసరించి నడుచుకొనిన యెడల మోక్ష రాజ్యము మన గమ్యమగును. అట్లుగాక దుర్నీతిలో మన జీవితమును గడిపినయెడల నిత్య నాశనము మనకు తధ్యమగును. అందుకే "ఒక మనష్యుడు లోక మంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొంటే అతని కేమి ప్రయోజనము?" అని యేసు బోధించెను (మత్తయి 16:26). అనగా ఈ లోకమందున్న ధన ధాన్యములన్నిటి కన్నా, సుఖభోగములన్నిటికన్నా ఒక మనుష్యునికున్న ఆత్మయొక్క విలువ గొప్పదని క్రీస్తు బోధించెను. ఆ ఆత్మ నిత్యము జీవించునది గనుక మానవుడు ఈ లోకములో జీవించిన కొద్ది సంవత్సరములలోనే తన నిత్యజీవితము కొరకు సిద్ధపడవలెనని బైబిలు బోధించు చున్నది. మనము నిత్యము పరలోకము లో జీవింపవలెనన్న ఇప్పుడు ఏమి చేయవలెనో తెలియజేయుట కొరకు బైబిలు వ్రాయబడి యున్నది. ఇట్లు బైబిలు మానవుని యొక్క ఆరంభము దేవుని దృష్టిలో అతనికి చూపించు చున్నది. అతడు దేవుని స్వరూపము గలవాడని అతని తత్వము నతనికి తెలియజేయుచున్నది. మరియు అతని గమ్యము ఇప్పుడు అతడు జీవించు జీవితములోనే నిర్ణయించుకొనవలెనని అది అతనికి బోధించుచున్నది.

బైబిలు గ్రంధము లేనియెడల మనము నిజదేవుని గూర్చి, నిజరక్షకుడైన క్రీస్తునుగూర్చి, చివరకు మనలను గూర్చి మనవే తెలిసికొన లేకపోదుము. తండ్రియైన దేవుని యొద్దకు ఒకే ఒక్కమార్గమున్నది. "నేనే మార్గమును, సత్యమును జీవమును, నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" అని

క్రీస్తు బోధించెను (యోహాను 14:6). వరలోక తండ్రి యొద్దకు నీవు చేరవలెనన్న నీవు క్రీస్తు దేవుని కుమారుడని నమ్మి నీ పాపముల విషయమై మారు మనస్సుపొంది, క్రీస్తు నామమును బహిరంగముగా ఒప్పు కొనుచు, క్రీస్తులోనికి బాప్తిస్మము పొంది మరణమువరకు ఆయనకు నమ్మకముగా జీవించుము. ఆయన నిన్ను తప్పక దీవించును.

-జాషువా గూటం

## సంఘ ప్రవేశము
## (Entering the Church)

గత సంచికలలో సంఘము యొక్క ప్రాముఖ్యతను గమనించితిమి. అనేక సంగతులను బట్టి సంఘము ప్రాముఖ్యమైనదని అర్థమగు చున్నది. అవేవన, సంఘము కొరకు క్రీస్తు చనిపోయెను (ఎఫెసీ 5:25), దానిని ఆయన తన స్వరక్త మిచ్చి సంపాదించెను (అపొ.కా. 20:28), దాని రక్షకుడు ఆయనే (ఎఫెసీ 5:23) అని లేఖనములు బోధించుచున్నవి. అయితే ఇప్పుడు కొన్ని ప్రశ్నలు ఉద్భవించుచున్నవి: ప్రాముఖ్యత లేని దాని కొరకు క్రీస్తు చనిపోవునా? విలువలేని దానికొరకు ఆయన తన రక్తమును చిందించునా? దానిలో లేకుండగనే ఒకడు రక్షింపబడ గలిగితే, అట్టి దానికి ఆయన రక్షకుడగునా? 'అట్లు కాదు' అని ఈ ప్రశ్నల న్నింటికి నీవు జవాబు ఇయ్యగలవు. అయితే మంచిదే, గాని సంఘము ప్రాముఖ్యము కాదనియు, దానిలో సభ్యులము కాకుండగనే రక్షింపబడ గలమనియు కొందరు ఏల చెప్పుచున్నారు? ఏలయనగా అట్టి ప్రజలు సంఘమును అపార్థము చేసికొని యున్నారు. అట్టివిధముగ ఆలోచించు కొనునట్లు వారు మోసగించబడి యున్నారు.

సంఘము రక్షించునని బైబిలు బోధించుటలేదు గాని ఒకడు రక్షింపబడవలెనంటే సంఘమందు ఉండవలెనని బోధించుచున్నది. నోవహు నిర్మించిన ఓడ రక్షకుడు కాదు గాని, నోవహు, అతని కుటుంబము

జలప్రళయము నుండి రక్షింపబడుటకు ఓడలో నుండవలసివచ్చెను. సంఘము యొక్క సంగతి కూడ అంతే. అంతేకాదు, ఒకడు రక్షింపబడగా అతనిని ప్రభువు సంఘముతో చేర్చును. పెంతెకోస్తు నాటినుండి నేటివరకు ప్రజలు సువార్తను విని, దానికి లోబడి "రక్షణ పొందుచున్న ప్రతివారిని ప్రభువు తన సంఘముతో చేర్చుచుండెను" (అపొ. కా. 2:47). గనుక ఒకడు రక్షింపబడినట్లయితే అతడు క్రీస్తు సంఘ సభ్యుడగును. సభ్యుడు కాని యెడల అతడు రక్షింపబడలేదు. ఇది బహు సులభ మైనది. ఇంకొక మాటలో సంఘమునకు వెలుపల రక్షణ అనేది లేదు. డినామినేషన్‌లోను మానవ సంస్థలలోను సభ్యుడు కాకుండ ఒకడు రక్షణ పొందగలడు గాని అతడు క్రీస్తు సంఘసభ్యుడు కాకుండ మాత్రము రక్షణ పొందుట అసాధ్యము.

ఇంకొక సంగతి ఏమంటే, క్రీస్తు సంఘము నందు ఒకడు తనకుగా తాను చేరలేడు; గాని రక్షణ పొందుచున్న వారిని ప్రభువు తన సంఘముతో చేర్చును. ఆయన రక్షణ పొందిన వారిని మాత్రమే సంఘమందు చేర్చును. గనుక సంఘములో రక్షింపబడిన వారుందురు. ఒకని విధేయత నిజమైనదో కాదో మన:పూర్వకమైనదో కాదో యని ప్రభువు అతని హృదయమును ఆంతరంగిక తలంపులను పరిశీలించును. ఒకడు సహృదయుడై లోబడిన యెడల ప్రభువు అతనిని సంఘముతో చేర్చును. కానియెడల అతడు బాహ్యక్రియలకు విధేయత చూపించుచున్నట్లు జరిగించి నను, అతడు ప్రభువు వలన సంఘ మందు చేర్చబడడు. ఒకడు తనకు తానే సంఘమందు చేరగలిగిన యెడల, మనుష్యుల ఆంతరంగిక భావము లెట్లున్నను అందరు అందులో ప్రవేశించ గలరు. అందువలననే ఒకని సంఘముతో చేర్చు బాధ్యతను ప్రభువే కలిగియున్నాడు. రక్షింపబడిన వారెవరో, కేవలము బాహ్యక్రియలను చేయు వారెవరో ఆయన యెరుగును గనుక ఆయన తప్పుచేయడు.

సంఘమునకు రక్షకుడు క్రీస్తే; రక్షింపబడిన వారిని అందు చేర్చువాడు ఆయనే గనుక, ఆయన సంఘమందు చేర్చబడుటకు మనము ఏమి చేయవలెనని ఆయన కోరుచున్నాడో సహజముగా తెలిసికొనుట మంచిది. దేవుని వాక్యమునందు ఇది విపులముగ వ్రాయబడియున్నది. అపొస్తలుల

కార్యములు అను పుస్తకములో యున్న అనేకమంది మార్పు చెందిన సందర్భములలో ఇది విశదమగుచున్నది. గనుక ప్రభువు సంఘము నందు చేర్చబడుటకు ఉన్న మెట్టులను జాగ్రత్తగ పరిశీలించుదము:

1.ఒకడు సత్యమును వినవలెను. "కాగా వినుట వలన విశ్వాసము కలుగును: వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును" (రోమా 10:17).

2.అతడు దేవుని యందును, క్రీస్తునందును విశ్వాసముంచవలెను. "విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము; దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయు వాడనియు నమ్మవలెను" (హెబ్రీ 11:6). "మీ హృదయమును కలవరపడనియ్యకుడి; దేవునియందు విశ్వాస ముంచుచున్నారు, నాయందును విశ్వాసముంచుడి" యని క్రీస్తు చెప్పెను (యోహాను 14:1).

3.అతడు తన పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను. "మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరును అలాగే నశింతురు" అని క్రీస్తు చెప్పెను (లూకా 13:3).

4.అతడు యేసుక్రీస్తు దేవుని కుమారుడు అని ఒప్పుకొనవలెను. అట్లు ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును అని క్రీస్తే చెప్పెను (మత్తయి 10:32).

5.మరియు అతడు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను. ఈ బాప్తిస్మము ఒక నీటి సమాధి (రోమా 6:3,4; అపొ.కా. 8:36-39). "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మని వానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:16). "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అపొ.కా. 2:38).

ఈ సంచికలో ముందు మనము ఏమి నేర్చుకొంటిమి? రక్షింపబడిన వారిని ప్రభువు సంఘముతో చేర్చునని కనుగొంటిమి. అనగా ఒకడు ప్రభువునకు విధేయుడై, రక్షింపబడినప్పుడు అతడు తక్షణమే సంఘములో చేర్చబడును. ఒకడు సత్యమును విని,

విశ్వసించి, మారుమనస్సు పొంది, క్రీస్తును ఒప్పుకొని, బాప్తిస్మము పొందినపుడు అతడు రక్షించబడునని గమనించితిమి. ఒక వ్యక్తి ఈ క్రియలను జరిగించినపుడు అతడు సంఘముతో చేర్చబడును. ప్రభువు ఆజ్ఞలకు మనము విధేయత చూపుట ద్వారా మనము రక్షించబడినపుడు మనలను ఆయనే తన సంఘముతో చేర్చును. ఇది సులభము కదా?

మరొక విధముగ చెప్పవలెనంటే ఒకడు ఆత్మమూలముగను. నీటి మూలముగను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో చేరలేడు అని ప్రభువు చెప్పెను (యోహాను 3:3-5). అయితే దేవుని రాజ్యము అనగా యేమి? అదే క్రీస్తు సంఘము (మత్తయి 16:18,19). సంఘములో ప్రవేశించవలెననిన ప్రభువు మనకొరకు రెండు మార్గములు నుంచునా? ఎన్నడు కాదు. గనుక ఒకడు నమ్మి బాప్తిస్మము పొందినపుడు (వాక్యము వలన ఆత్మ ద్వారా జన్మించి, ఆ బోధకు లోబడినపుడు) అతడు దేవుని రాజ్యములోనికి లేదా దేవుని కుటుంబములోనికి లేదా ప్రభువు సంఘములోనికి జన్మించినవాడగును.

మరల, మనము ఒకే శరీరములోనికి బాప్తిస్మము పొందితిమని పౌలు చెప్పుచున్నాడు (1కొరింథి 12:13). అయితే శరీరమనగా యేమి? అదే సంఘము (కొలస్స 1:18). అయితే అవి ఎన్ని ఉన్నవి? ఒక్కటి మాత్రమే (ఎఫెసీ 4:4; 1:22,23). ఒకడు దానిలో ఎట్లు ప్రవేశించును? బాప్తిస్మము పొందుట ద్వారా. అయితే ఒకడు రక్షింపబడ వలెననిన, నమ్మి బాప్తిస్మము పొంద వలెనని క్రీస్తు చెప్పెను (మార్కు 16:16). కొరింథులో నున్నవారు దానినే చేసిరి (అపొ.కా. 18:8). గనుక ఒకడు సంఘములోనికి బాప్తిస్మము పొందినపుడు అతడు దానిలో ఒకభాగమవును లేదా దానితో చేర్చబడును.

మనము చూచిన దానిని బట్టి రక్షింపబడుటకు ఒకే ఒక్క మార్గము ఉన్నది. రక్షణ పొందినవారిని ప్రభువు తన సంఘముతో చేర్చును. నీవు బైబిలునందున్నట్టి సంఘ సభ్యుడవా? కాని యెడల నీవు రక్షించబడలేదు. బైబిలును పరిశోధించి, పఠించి ప్రభువునకు లోబడుము. అప్పుడు ఆయనే నిన్ను తన సంఘముతో చేర్చును.

- జె.సి.చోట్

## బ్రదికియున్నా చచ్చిన సంఘము (సార్దీస్)

(Tombstone Territory)

(ప్రకటన 3:1-6)

### ఉపోద్ఘాతము:

సార్దీసు ఒక పురాతన నగరము. అది విలాసములతోను, అవినీతితోను, బానిసత్వముతోను నిండియుండెను. ఇంకోమాటలో మృత నగరము!

1. స్వయంపాలన గల పట్టణం అది, రోమీయుల చట్టం అక్కడ చెలామణి అయ్యేది.
2. క్రోసియస్ అనురాజు యొక్క పట్టణం అది. అతడు విస్తారమైన ధనం గలవాడు.
3. ప్రాచ్య ఆసియాలో మొట్టమొదట నాణెములు సార్దీసులోనే ముద్రించ బడెను. పర్షియా దేశపు రాజైన కోరెషు సార్దీసును పట్టుకొన్నప్పుడు క్రోసియస్ నుండి విస్తారమైన సొమ్మును కొల్లగొట్టెను.
4. సార్దీసులో ఉన్ని పరిశ్రమ యుండెను.
5. ప్రజలు సిబెలెయను దేవతను ఆరాధించేవారు.
6. సార్దీసు క్రీ॥శ 17లో భూకంపము వలన కూలబడెను. తిబెరియ కైసరు 5 సంవత్సరముల మట్టుకు అన్ని రకాల పన్నులను రద్దుచేసెను. అతడా పట్టణ పున:నిర్మాణము కొరకు బహు ధనమును వెచ్చించెను.
7. సార్దీసు గతంలో గొప్పపట్టణమే అయినను, అది అన్ని రంగాలలో మృతనగరంగా తయారయ్యెను.

### I. క్రీస్తు యొక్క వర్ణన:(1వ)

A. క్రీస్తు దేవుని యొక్క ఏడాత్మలు గలవాడని చెప్పబడినది.

B. ప్రక 5:6లో యోహాను ఇట్లు చెప్పాడు: "మరియు సింహాసనము నకును ఆ నాలుగు జీవులకును పెద్దలకును మధ్యను వధింపబడి నట్లుండిన గొర్రెపిల్ల నిలిచి యుండుట చూచితిని. ఆ గొర్రెపిల్లకు ఏడుకొమ్ములును, ఏడు కన్నులుండెను. ఆ కన్నులు భూమి

యందంతటికిని పంపబడిన దేవుని యేడు ఆత్మలు". కన్నులు దేవుని జ్ఞానమును సూచించును. గనుక యేసు సర్వజ్ఞానియు, సర్వశక్తి మంతుడును.

C. బైబిలుకు బైబిలును బట్టియే భావార్థము చెప్పుట మంచిది.

**II. క్రీస్తు యొక్క అభిశంసన (1,2వ)**

A. నిజానికి సార్దీస్ సంఘానికున్న అభినందన శూన్యము.

B. "జీవించుచున్నావన్నపేరు మాత్రమున్నది గాని నీవు మృతుడవే", యని దేవుని కుమారుడు సార్దీస్ సంఘమునకు చెప్పెను. బహుశా సంఖ్యలో ఆ సంఘము పెద్దదై యుండవచ్చును, దానిలో ప్రముఖులుండవచ్చును, గనుక వారికి పేరున్నది. బహు మంది ధనికులు కూడ అందుండ వచ్చును. వాళ్లు పేరుకు సువార్త కూటములు, బైబిలుక్లాసులు జరుపుతు యుండవచ్చును. అయితే అవి మృత దేహముపై కప్పిన ప్రేత వస్త్రములే.

C. సార్దీస్ మృత సంఘము గాని అది వారికి తెలియదు. వారు సంసోను వలె, "యెహోవా తనను ఎడబాసెనని" వారకి తెలియదు (న్యాయాధి 16:20). అనేకులు మృతులేగాని వారికి తెలియదు. మృతులందరు సమాధులలో లేరు. కొందరు రెండు కాళ్ల మీద ఇక్కడ నడుచుచుయున్నారు!

మత్తయి 8:22; I తిమోతి 5:6; లూకా 15:4; ఎఫెసీ 2:1;మత్తయి 22:32.

D. ఎఫెసు సంఘములో ప్రేమలేదు. పెర్గములోను, తుయతైరలోనున్న సమస్య అబద్ధ బోధ, సార్దీస్ అయితే సమాధుల దొడ్డి! వారికి యూదులతో సమస్యలు లేవు. కైసరు ఆరాధన అక్కడలేదు. అంతరంగికంగా విశ్వాస భ్రష్టత్వము లేదు. వారు ప్రశాంతము గా యున్నారు, అంతే. వారి నిశ్శబ్ధత, సమాధుల నిశ్శబ్ధతయే.

E. ఎందు వలన?

1. బహుశా వాళ్లు గతాన్ని స్మరిస్తూ గతంలోనే జీవించుచున్నారు. గతంలో సాధించిన సంగతులపైనే ఆధారపడి యుండిరి.

2. వారి పనిలో వారి హృదయం (మనస్సు)లేదు (మత్తు 15:8-9).

3. వారేమి బోధించారో దాన్ని అమలు పర్చుట లేదు (2తిమో 3:5; తీతు 1:16).

4. వారి ఉద్దేశ్యములు మంచివి కాకపోవచ్చును (2 కొరి 5:14).

5. వారు ఆత్మీయ సంగతులకంటె భౌతిక సంగతులపై ఎక్కువ ఆసక్తి కలిగి యుండిరి (ప్రక 3:17;మత్త 6:33).

F. జాగరుకుడవై యుండుమని క్రీస్తు వారికి చెప్పెను. ఇంకోమాటలో నిద్రనుండి మేల్కొనుము! (ఎఫెసీ 5:14).

1. మందలో ప్రవేశించు తోడేళ్లను గూర్చివారు మెలకువగా యుండాలి (అపొ.కా. 20:29-31).

2. శోధనలో పడకుండా వారు మెలకువగా యుండాలి (మత్త 26:41).

3. సాతానుని గూర్చివారు మెలకువగా యుండాలి (I పేతురు 5:8).

4. క్రీస్తు ఎప్పుడైనా మరల రావచ్చును. గనుక మెలకువగా యుండాలి ( I థెస్స 5:2,6).

G. వారు చావనైయున్న మిగిలిన వారిని బలపర్చాలి. ఇంకా చావకుండా కొందరు సభ్యులున్నారు. వారు సంపూర్తిగా సాతానువైపు పోలేదు. వారు మరల వెలిగింపబడాలి.

H. "నీ క్రియలు నా దేవుని యెదుట సంపూర్ణమైనవిగా నాకు కనబడ లేదని" యేసుక్రీస్తు ఈ సంఘమును చాల తీవ్రముగా అభిశంసించారు. వారు ఏపని సంపూర్తిగచేయలేదు. ఈ క్రియలు 'నా దేవుని యెదుట'అను సంగతి గమనించుము. దేవునికి సమస్తమును ఎరుకే. ఆయన సమస్తాన్ని చూస్తున్నారు. పందెమును ప్రారంభించుట ఒకటి, దాన్ని ముగించుట మరింకొకటి. తమ పందెమును సంపూర్తిగ ముగించాలని క్రీస్తుకోరుచున్నారు. ఆయనను వెంబడించకముందు మనం లెక్కచూచు కోవాలని క్రీస్తు బోధించారు (లూకా 14 అధ్యా). అనేకులు కట్టుటకు మొదలిడ్తారు గాని ముగించరు. వారు హేళన పాలగుదురు. రక్షింపబడాలంటే మనం అంతము వరకు సహించాలి (మత్త 24:13). మేలు చేయుట

యందు విసుగక యుండాలి (గలతీ 6:9). మరణపర్యంతము నమ్మకముగా యున్నవారు జీవ కిరీటము పొందుదురు (ప్రక 2:10).

**I. తరువాత క్రీస్తు జ్ఞాపకము చేసికొనుమని చెప్పారు. ఏమి జ్ఞాపకం చేసికోవాలి?**

1. ఏలాగ ఉపదేశము పొందితివో, యేలాగు వింటివో జ్ఞాపకము చేసికోవాలి. వారికి ఇది వరలో ఉపదేశము చేయబడింది. అది వారి దగ్గర ఇంకా యున్నది.

2. యేలాగు వింటిరో జ్ఞాపకం చేసికొనాలి. వారికి చేయబడిన ఉపదేశం, వారు విన్నా సంగతి యేమిటి? సువార్త! (I కొరింథీ 15:1-4).

3. తరువాత వారు మారుమనస్సు పొందాలి. ఈ యాజ్ఞతో ఒక హెచ్చరిక కూడ ఇయ్యబడింది. "నీవు జాగరుకుడవై యుండని యెడల దొంగవలె వచ్చెదను".

సార్దీస్ పట్టణం చుట్టూ ప్రాకారము లుండేవి. అయినను పర్షియా దేశపు కోరెషు రాజు ఆ పట్టణాన్ని పట్టుకోగలిగాడు. నీవనుకొనని గడియలో వచ్చెదనని క్రీస్తువారికి హెచ్చరిక చేసారు.

**II. విమోచన కర్తకు మిగిలిన వారు (4,5,వచ)**

A. తమ వస్త్రములను అపవిత్ర పరచుకొననివారు సార్డీన్‌లో ఇంకా కొందరున్నారు.

1. విమోచనకర్తకు మిగిలిన వారెల్లప్పుడు యుంటారు. పిలువబడిన వారనేకులు గాని ఏర్పరచబడినవారు కొందరేయని క్రీస్తు చెప్పారు (మత్త 22:14). ఎక్కడ ఇద్దరు ముగ్గురు అయన నామమున కూడియుందురో వారిమధ్య ఆయన యుందునని వాగ్దానం చేసారు. అనేకులు విశాలమార్గమున పోవుచుండగా ఇరుకు మార్గమున ప్రవేశించువారు కొందరే. ఇరుకు మార్గమే జీవ మార్గము (మత్త 7:13-14).

2. 'అపవిత్ర పరచుకొనని వస్త్రములు' అను పదము సార్దీసులో యున్న ఉన్ని దుస్తుల పరిశ్రమను బట్టి చెప్పబడెను. గ్రీకు దేవుండ్లను ఆరాధించేవారు మురికి వస్త్రములతో ఆరాధించుట అపవిత్రముగా ఎంచబడేది. పాత నిబంధన ప్రకారము యాజకుడు

తన్నుతాను శుద్ధి చేసికొంటేనే గాని దేవుని సముఖమున ప్రవేశింప జాలడు. ప్రజలు పాపము తోను,దుర్మార్గముతోను కలుషితమై యుండగా అట్టివారి సేవను దేవుడు అంగీకరించడు. క్రైస్తవుడు ఈ లోక మాలిన్యములు తనకు అంటకుండా చూచుకోవాలి (యాకోబు 1:27). దేవుని చూడాలంటే మనం హృదయ శుద్ధి కలిగియుండాలి. (మత్త 5:8). క్రీస్తు యొక్క సంఘము మచ్చగాని, ముడతగాని, యే కళంకముగాని లేనిదిగా యుండాలి (ఎఫెసీ 5:26-27). నిషిద్ధమైనదేదీ పరలోకంలో ప్రవేశింపదు (ప్రక 21:27). క్రీస్తు యొక్క వధువు పరిశుద్ధుల నీతి క్రియలను ధరించుకొనును (ప్రక 19:8).

B.1.'వారు నాతో కూడ సంచరించెదరు' అని క్రీస్తు చెప్పెను. అంటే నాతో కూడ నడిచెదరని యర్థం. మనం పిలువబడిన పిలుపుకు తగినట్టుగా నడుచుకోవాలి (ఎఫెసీ 4:1). సమ్మతింపకుండా ఇద్దరు కూడి నడుతురా? యని ఆమోసు 3:3 చెప్పుతుంది. సార్డీస్‌లో నమ్మకముగా యున్న కొద్దిమంది క్రైస్తవులు క్రీస్తుతో కూడ నడుచుచుండిరి.

2.వారు తెల్లని వస్త్రములు ధరించు కొందురు. తెలుపు ఎప్పుడు పవిత్ర తకు, విజయానికి, సంతోషానికి సూచన.

**III. ప్రతిఫల వాగ్దానము (5వచ)**

**A.** క్రైస్తవులు జయించాలి. క్రైస్తవ్యము ఒకని ఆత్మీయ పోరాటమునకు నడిపించును. అది పోరాట జీవితం. (2 తిమో 2:3,4;3:12; ఎఫెసీ 6:10-18).

B. జయించువాడు తెల్లని వస్త్రములు ధరించుకొనును. యివి యద్ధభూమి లో విజేతలు ధరిస్తారు. పండుగలలో ధరిస్తారు. పవిత్రకు సూచనగా అవి ధరిస్తారు.

C. జయించు వాని పేరు జీవ గ్రంథములో ఎంత మాత్రము తుడుపు పెట్టబడదు.

1. ఆయన గ్రంథములో దాఖలైన వారు తప్పించుకొందురని దానియేలు 12:1 చెప్పుచున్నది.

2. దేవుని యెదుట జ్ఞాపకార్థ గ్రంథము వ్రాయబడినట్లు మలాకీ 3:16

చెప్పుచున్నది.

3. వారి పేర్లు జీవగ్రంథమందు లిఖించబడినందున అపొస్తలులు సంతోషించాలని యేసు చెప్పెను.

4. ఎవరి పేరైనను గొర్రెపిల్ల జీవగ్రంథమందు వ్రాయబడినట్టు కనబడని యెడలవాడు అగ్ని గుండములో పడివేయబడును (ప్రక 20:15).

D. చివరిగా వారిని క్రీస్తు తండ్రియైన దేవుని యెదుటను, దూతల యెదుటను ఒప్పుకొందునని వాగ్దానము చేసెను.

1. మనమాయనను ఒప్పుకొంటే క్రీస్తు మనలను ఒప్పుకొనును (మత్తయి 10:32-33).

2. మనమాయనను గూర్చి సిగ్గుపడిన యెడల ఆయన మనలను గూర్చి సిగ్గుపడును (మార్కు 8:38).

**ముగింపు:-** ఈ వర్తమానమును బట్టి క్రైస్తవులు పాపముచేసి నశించి పోగలరని గ్రహించాము. సంఘము పైకి బాగానే కనబడినా లోపల చచ్చినదై యుండును. దేవుని ప్రజలనేకులు నేడు ఆత్మీయంగా మృతులగుచున్నారు. వారు జాగరూకులవ్వాలి. ఆరంభించిన దానిని ముగించాలి, జ్ఞాపకముంచుకోవాలి. దేవునికి నమ్మకముగా యుండేవారు కొందరే. ప్రవిత్రముగా యుండుట అత్యవసరం. క్రైస్తవులు దేవుని సైన్యములో సిపాయిలు; అందువలన పోరాడుటకు ఆసక్తి పరులై యుండాలి. ఓడిపోతే జీవ కిరీటాన్ని కోల్పోతాము. జయిస్తే కలిగే ఫలితం గొప్పది!

**-జాన్‌స్టేసీ**

**గమనిక: సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు 50/-రూ॥లు చందా విధిగా పంపించవలయును.**

SATYA VANI,P.O.BOX-80, KAKINADA - 533 001.

# పులిసిన పిండి

## మూలవాక్యం - మత్తయి 16:6

"అప్పుడుయేసు చూచుకొనుడి పరిసయ్యులు; సద్దూ కయ్యులు అనువారి పులిసిన పిండిని గూర్చి జాగ్రత్తపడుడని" వారితో చెప్పెను.

పులిసినది చాలా ప్రమాదకరమైనది. పులిసినదానిని గూర్చి ధర్మశాస్త్రములో దేవుడు ఇశ్రాయేలీయులకు ఈ విధముగా చెప్పియున్నాడు. "ఏడు దినములు పులియని రొట్టెలను తినవలెను. మొదటి దినమున మీ యిండ్లలో నుండి పొంగినది పారవేయ వలెను. మొదటి దినము మొదలుకొని యేడవదినము వరకు పులిసిన దానిని తిను ప్రతి మనుష్యుడు ఇశ్రాయేలీ యులలో నుండి కొట్టివేయబడును", (నిర్గమ కాండము 12:15,19,20). యిది దేవుడైన యెహోవా ఇశ్రాయేలీ యులకు పస్కా విషయంలో యిచ్చిన కట్టడ గనుక పులిసిన దానిని తిను ప్రతివాడు దేవుని కట్టడను అతిక్రమించి పాపము చేసినవాడగును. ఆజ్ఞాతి క్రమమే పాపము (1 యోహాను 3:4).

క్రీస్తు పరిసయ్యులు సద్దూ కయ్యులు అనువారి పులిసిన పిండిని గూర్చి జాగ్రత్త పడుడని తన శిష్యులతో చెప్పెను. అయితే పులిసిన పిండిని గూర్చి కాదుగాని వారి బోధను గూర్చియే జాగ్రత్తపడుడని ఆయన చెప్పెను. వారిని గూర్చి యేసు క్రీస్తు ఏమి చెప్పారో చూద్దాం:-

**పరిసయ్యులు సద్దూకయ్యుల (పులిసిన పిండి) బోధ:-**

సద్దూ కయ్యులు పునరుత్థానము లేదనియు దేవదూతయైనను ఆత్మయైనను లేదనియు చెప్పుదురు గాని పరిసయ్యులు రెండును కలవని యొప్పుకొందురు. అపొ.కా. 23:8.

1. అయితే వారు అగ్రస్థానములందు కూర్చుండువారు. మత్తయి 23:6

2. భారమైన బరువులు కట్టి మనుష్యుల భుజముల మీద పెట్టు దురేగాని తమ వ్రేలితోనైనను వాటిని కదిలింపనొల్లరు. మత్తయి 23:3.

4. బోధకులని, గురువని, తండ్రి అని మనుష్యుల చేత పిలువబడేవారు మత్తయి 23:6.

5. మనుష్యుల మెప్పును ఎక్కువగా ఆపేక్షించేవారు. యోహాను 12:43

6. పరలోక రాజ్యములో ప్రవేశింపరు

ప్రవేశించువారిని ప్రవేశింపనియ్యరు. మత్తయి 23:14

7. వారు వేషధారులు అవివేకులైన అంధులైన మార్గదర్శకులు. మత్తయి 23:15,16

8. పదియవ వంతు చెల్లించి ధర్మశాస్త్రములో ప్రధానమైన విషయములను విడిచిపెట్టినవారు. మత్తయి 23:23

9. గిన్నెయు పళ్లెమును వెలుపట శుద్ధిచేసేవారు. మత్తయి 23:25

10. సున్నము కొట్టిన సమాధులను పోలినవారు. మత్తయి 23:27

11. వెలుపల మనుష్యులకు నీతిమంతులుగా కనబడేవారు. మత్తయి 23:28

12. గ్రుడ్డివారైయుండి గ్రుడ్డివారికి త్రోవచూపువారు. మత్తయి 15:14, యోహాను 9:39-41.

వారి విషయమై క్రీస్తు చెప్పిన ఉపమానము లూకా 18:9-14 లో వ్రాయబడింది. "తామే నీతిమంతులని తమ్ము నమ్ముకొని యితరులను తృణీకరించు కొందరితో ఆయన ఈ ఉపమానము చెప్పెను-ప్రార్ధన చేయుటకై యిద్దరు మనుష్యులు దేవాలయమునకు వెళ్ళిరి వారిలో ఒకడు పరిసయ్యుడు, ఒకడు సుంకరి, పరిసయ్యుడు నిలువబడి దేవా! నేను చోరులను అన్యాయస్థులను వ్యభిచారులునైనా యితర మనుష్యుల వలెనైనను ఈ సుంకరివలెనైనను ఉండనందుకు నీకు కృతజ్ఞతాస్తులు చెల్లించుచున్నాను. వారమునకు రెండు మారులు ఉపవాసము చేయుచు నా సంపాదన అంతటిలో పదియవంతు చెల్లించుచున్నానని తనలో తాను ప్రార్ధించుచుండెను". యిట్టి ప్రార్ధన దేవునికి అంగీకారముకాదు. పరిసయ్యుడు తన్ను తాను హెచ్చించుకొనుచు తనను తానే నీతిమంతునిగా కనబరుచుకొన్నాడు అయితే దేవుడు హృదయములను ఎరుగును. అందుచేత వారి విషయమై జాగ్రత్తపడుడని క్రీస్తు తన శిష్యులతో చెప్పెను. దయచేసి మత్తయి 5:20 చదువుము.

**అబద్ధ బోధకుల (పులిసిన పిండి) బోధ:-**

అబద్ధ బోధకుల బోధ విషయమై జాగ్రత్త పడుడని హెచ్చరించుట- అబద్ధ ప్రవక్తలను గూర్చి జాగ్రత్తపడుడి వారు గొఱ్ఱెల చర్మములు వేసికొని మీయొద్దకు వత్తురు. మత్తయి 7:15. "నేను వెళ్ళిపోయిన తరువాత క్రూరమైన తోడేళ్లు మీలో ప్రవేశించునని నాకు తెలియును వారు మందను కనికరింపరు"

(అపో. కా. 20:28,29), రోమా 16:17,18 చదువుము. వారు భిన్నాభిప్రాయములను రహస్యముగా బోధించుదురు, II పేతురు 2:1,2,3 వచనములు. వారి నోళ్లు మూయింప వలెను. వారు ఉపదేశింపకూడని వాటిని దుర్లాభము కొరకు ఉపదేశించుచు కుటుంబములకు కుటుంబములనే పాడుచేయుచున్నారు (తీతు 1:10,11). కలిపి చెరిపెడు బోధలను బోధించువారు. II కొరింథు 2:17. వీరినిబట్టి సత్యమార్గము దూషింపబడును II పేతురు 2:2. వారు అధిక లోభులై, కల్పనా వాక్యములు చెప్పుచు మీ వలన లాభము సంపాదించుకొందురు (II పేతురు 2:3 వచనం). అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికులవేషధారణ వలన మోసపరచు ఆత్మలయందును, దయ్యముల బోధయందును లక్ష్యముంచి విశ్వాసభ్రష్టులగుదురని ఆత్మ తేటగా చెప్పుచున్నాడు (I తిమోతి 4:1).

**నీ బోధయైతే:-**

నీ ఉపదేశము మోసము లేనిదిగాను మాన్యమైనదిగాను నిరాక్షేపమైన హితవాక్యములతో కూడినదిగాను ఉండవలెను. తీతు 2:7,8.

నిన్ను గూర్చియు నీ బోధను గూర్చియు జాగ్రత్త కలిగి యుండుము, వీటిలో నిలుకడగా ఉండుము; నీవీలాగు చేసి నిన్నును నీ బోధ వినువారిని రక్షించుకొందువు. I తిమోతి 4:16. దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనపరచుకొనుటకు జాగ్రత్తపడుము IIతిమోతి2:15. అన్ని విషయములలో మితముగా ఉండుము శ్రమపడుము, సువార్తికుని పనిచేయుము, నీపరిచర్యను సంపూర్ణముగా జరిగించుము. II తిమోతి 4:5.

ప్రియులారా! క్రీస్తు తన శిష్యులతో పరిసయ్యుల సద్దూకయ్యుల (పులిసిపిండి) బోధను గూర్చి జాగ్రత్త పడుడని హెచ్చరించారు. నేటి క్రీస్తు సంఘస్థులమైన మనము అబద్ధ బోధకుల (మత శాఖల) వారి (పులిసినపిండి) బోధనుగూర్చి జాగ్రత్తపడుడని హెచ్చరింపబడుచున్నాము. ఎందుకనగా I కొరింథి 5:6 మరియు గలతీ 5:9 ప్రకారము పులిసిన పిండి కొంచెమైనను ముద్దంతయు పులియజేయును గనుక మనము

పులిపిండి లేనివారము. గనుక పాతదైన పులిపిండితోనైనను దుర్మార్గ తయు దుష్టత్వమునను పులిపిండి తోనైనను కాకుండ నిష్కాపట్యమును సత్యమునను పులియని రొట్టెతో క్రీస్తుని ఆరాధించుదము. నీవింకను అబద్ధబోధ నుయిష్టపడుచున్న యెడల దానినిప్పుడే వదిలిపెట్టుము. నీ దగ్గరయున్న బైబిలును పఠించుము లేనియెడల నీకు దగ్గరలో యున్న క్రీస్తు సంఘమును దర్శించుము. దేవుడు నీకు సహాయము చేయునుగాక!

-జె.కె.ఏలియా,వరంగల్లు.

## క్రీస్తులో క్షమాపణ

క్షమాపణ అనగా ఒకని అపరాధము లను తుడిచివేయుట, కేన్సల్‌చేయుట, పూర్తిగా క్షమించుటయని అర్థము (కీర్తన 32:12; మత్తయి 9:2; లూకా 7:48). పావక్షమాపణను గూర్చి చెప్పు కొన్నప్పుడు 'మా పాపములను మా మీద మోపవద్దు' అని సంఖ్యా 12:11 లో యున్న మాటను కూడ గుర్తుంచు కోవాలి.

అవిధేయులైన మానవులు దేవుని ఆజ్ఞలను ఉల్లంఘించుట ద్వారా తమ కొరకు సృష్టించుకొనిన దు:ఖ పరిస్థితిని దేవుడు అంతమొందించుట క్షమాపణ యని చెప్పవచ్చును. మానవుని పాపము దేవునికి తీవ్ర అభ్యంతరము గాను, మానవునికి హానికరముగాను యుండును. పరిశుద్ధ దేవునికి, మానవునికి మధ్యనున్న నిజసంబంధాన్ని పాపము చెడగొట్టును. మానవుడు తనకుగా తాను పాపనివృత్తి కొరకు యేమీ చేయలేడు. అందువలన ఇక్కడ దేవుడు తన సార్వభౌమత్వముతో పనిచేయును. తన దీర్ఘశాంతము వలనను కరుణ వలనను తన తీర్పును అమలుచేయక మానవునికి ఉపశ మనము కలుగజేయును.

నిర్హేతుకముగా అనుగ్రహించబడు క్షమాపణను గూర్చి క్రొత్తనిబంధన వక్కాణించుచున్నది. మత్తయి 18:23-25లో దేవుని క్షమాపణ మనకు వర్ణించబడినది. పాపసహిత మానవులు దేవుని యెదుట నిలబడలేరు. తమ్మును తాము రక్షించుకొనలేరు. "అందుకు వారు అత్యధికముగా ఆశ్చర్యపడి - అట్లయితే ఎవడు రక్షణ పొందగలడని ఆయన నడిగిరి. యేసువారిని చూచి-ఇది మనుష్యులకు అసాధ్యమే గాని దేవునికి అసాధ్యము

కాదు; దేవునికి సమస్తమును సాధ్యమే అనెను" (మార్కు 10:26-27).

దేవుడు మానవుని ప్రేమించుచున్నాడు. ఆయన కృప చొప్పున అనుగ్రహింపబడిన రక్షణ షరతులకు లోబడు ప్రతివానిని ఆయన రక్షింపగోరుచున్నారు. "నీ పాపములు క్షమింపబడియున్నవి" (మార్కు 2:5). విశ్వాసము, మారుమనస్సు, ఒప్పుకోలు,బాప్తిస్మము అను రక్షణ షరతులకు లోబడు వానికి పాపముల క్షమాపణ సువార్తయై యున్నది. (అపొ.కా. 2:38,రోమా 6:1-10). మానవుడు తండ్రి యింటికి తిరిగి వస్తాడని దేవుడు ఎదురుచూచుచున్నాడు (లూకా 15:11-32). మానవుడు అనర్హుడే అయినను దేవుని యొక్క దయ వలన అతడు తండ్రి యొద్దకు తిరిగి వచ్చుట సాధ్యమగును.

దేవుని కుమారుడైన యేసుక్రీస్తు లేకుండా పాపక్షమాపణ, మానవుని పునరుద్ధరణ అసంభవము. పాపములు క్షమించు అధికారము క్రీస్తు ఒక్కరే కలిగియున్నారు. "మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రియధనముగా తన ప్రాణము ఇచ్చుటకును వచ్చెనని" యేసు చెప్పెను (మార్కు 10:45).

క్రీస్తు సంఘమును పరశీలించుచుండగా పాపముల క్షమాపణ క్రీస్తుకు, క్రైస్తవ జీవితమునకు సంబంధించియున్నది. ఈ కృప బాప్తిస్మములో విశదమగుచున్నది. "మీరు మారుమనస్సుపొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తునామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మయను వరము పొందుదురు" (అపొ.కా. 2:38). లూకా 24:47;రోమా 6:1-10ని కూడ చదువుము.

తమ యెడల అపరాధము జరిగించిన వారిని క్రైస్తవులు తప్పక క్షమించాలి. యితరుల అపరాధములను క్షమించకుండా దేవునికి ఇష్టుడై క్రైస్తవుడు జీవించుట అసాధ్యము (మత్త 6:12-14;18:21-35; మార్కు 11:25).

"ఆ కుమారుని యందు మనకు విమోచనము, అనగా పాపక్షమాపణ కలుగుచున్నది" (కొలస్స 1:14). "దేవుని కృపా మహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియనియందు ఆయన రక్తము వలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది"(ఎఫెసీ 1:7).

-హేన్స్ డెడెర్షెక్

# సంక్షిప్త వార్తలు

2006 డిశంబరు 10వ తేదీ ఆదివారము నాడు తాళ్లరేవు సీతారాంపురములో నిర్మించబడిన క్రీస్తుసంఘ ఆలయమును సహోదరులు జాషువా గూటంగారు రిబ్బను కత్తిరించి ప్రభువు పనికి ప్రతిష్టించిరి. దేవుని కృపతో స్థానిక సంఘ సహకారములతో ఆ ఆలయ నిర్మాణము ఘనముగా జరిగినది. అక్కడ వాక్యపరిచర్యచేయుచున్న సోదరులు జాన్‌విక్టర్ గారి యొక్క ప్రార్ధనపూర్వక కృషివలన ఆలయ నిర్మాణము అనతికాలములోనే సంపూర్తి ఆయెను. ఆరోజు జరిగిన కూటమునకు ఇంచుమించు మూడువందల మంది హాజరై దేవుని స్తుతించిరి. జాన్ విక్టర్ గారు తాళ్లరేవులోను, నీలపల్లి వెంకటరేవులోను వాక్యపరిచర్యచేయుచున్నారు.

2006 డిశంబరు 15వ తేదీ శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లా సమిశ్రగూడెంలో సోదరులు జి. బాబురావ్ గారి కృషి వలన నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయమును సోదరులు యమ్.సామ్యూల్ రాజు గారు రిబ్బను కత్తిరించి దేవుని పనికొరకు ప్రతిష్టించిరి. ఆ ప్రత్యేక కూటమునకు ఉభయ గోదావరి జిల్లాల నుండి వచ్చిన అనేక మంది సువార్తికులు స్థానికులు హాజరైరి. సోదరులు జాషువా గూటం గారు ఆ సందర్భముగా చక్కటి వాక్యపరిచర్య చేసిరి. సోదరులు రిక్కీగూటం గారు కూడ సతీసమేతముగా హాజరై తనదైనశైలిలో వాక్యపరిచర్యచేసిరి. ఆనాటి సభకు సోదరులు యమ్.విజయకుమార్ గారు అధ్యక్షతవహించి, సభను సమర్ధవంతముగా నడిపించిరి. సమిశ్రగూడెంలోను, పరిసరప్రాంతములలోను సోదరులు జి.బాబురావ్ గారు సత్యవాక్యమును చాటించుచున్నారు. కూటమునకు హాజరైన వారందరికీ చక్కటి ప్రేమ విందును అక్కడి స్థానిక సంఘము ఏర్పాటు చేసినది.

2006 డిశంబరు మొదటి తేదీనాడు కిర్లంపూడి మండలం చదలాడలో జరిగిన స్తుతి కూటములో సోదరులు రిక్కీ గూటం గారు సతీసమేతముగా హాజరై వాక్యపరిచర్య చేసిరి. అక్కడ యమ్. ప్రేమ్ కుమార్ గారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

డిశంబరు 5వ తేదీనాడు రామచంద్రపురం మండలం ఉట్రుమిల్లిలో రాత్రివేళ

జరిగిన కూటములో రిక్కీ గారు వాక్యపరిచర్య చేసిరి. నాటి కూటమునకు అనేకులు హాజరైరి. అక్కడ యు.యేసురత్నం గారు పనిచేయుచున్నారు.

డిశంబరు 26వ తేదీ మంగళవారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం (కొల్లేరు సరస్సు ఏరియా) సీతారాంపురంలో జరిగిన సువార్త కూటములో రిక్కీ గారు వాక్యపరిచర్య చేసిరి. అక్కడ సోదరులు క్రిష్ణమూర్తిగారు సువార్త చాటుచున్నారు.

డిశంబరు 28వ తేదీ రాత్రి కాకినాడ గొడారిగుంటలో జరిగిన కూటములో రిక్కీ గారు వాక్యపరిచర్య చేసిరి. అక్కడ సోదరులు కొండలరావు గారు పనిచేయుచున్నారు.

సత్యవాణి ద్వారా బైబిలు కరస్పాండెన్సు కోర్సుపూర్తి చేసిన వారికి అనేక సంవత్సరముల నుండి ఉచితముగా బైబిలు ఇయ్యబడుచున్నది. మీ స్థానిక సంఘములలో చదువు కొన్న వారందరు ఈ కోర్సు పూర్తి చేయునట్లు ప్రోత్సహించండి. వారు కూడ సత్యవాణి నుండి ఉచితముగా బైబిలును పొందేలాగున ప్రోత్సహించమనవి.

**వోయిస్ అఫ్ ట్రూత్ ఇంటర్నేషనల్ వాల్యూమ్-8 ఇప్పుడు లభ్యమగు చున్నది. వలయు వారు సత్యవాణికి వ్రాసి ఉచితముగా పొందవచ్చును.**

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2006-2008

To

From:

SATYA VAKKU
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004